సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం | 5 | డిసెంబర్ | 2023



ఆటల అభివృద్ధికి బాటలు
రాష్ట్రంలో క్రీడలు, యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి శాఖలను వేరు చేస్తూ జీఓ విడుదల అయింది. ఇకపై డీఎస్ఏ పాలనా పరమైన వ్యవహారాలను డీఎస్ఏ అధికారులే పర్యవేక్షిస్తారు.

8లో



ఘనంగా సత్యదీక్షల విరమణ
రత్నగిరి వాసుడు సత్యదేవుని నామం జపిస్తూ దీక్షలు ఆచరించిన వేలాది మంది స్వామివారి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా సోమవారం దీక్ష విరమించారు.

నీటి విడుదల తగ్గింపు



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు నీటి విడుదలను తగ్గించారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు పూర్తిగా నీటి విడుదలను నిలిపివేశారు.

న్యూస్‌రీల్

క్రీడా స్ఫూర్తి అభినందనీయం: కలెక్టర్



విజేతలకు బహుమతులు అందజేసిన కలెక్టర్ మాధవీలత జేసీ తేజ్‌భరత్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: వివిధ పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు చూపిన క్రీడా స్ఫూర్తి అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ క్రీడల్లో పలువురు ప్రతిభ చాటారన్నారు. బూరుగుపూడి కన్నా ఆశ్రయ్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు చెందిన పది మంది ప్రతిభ చాటారన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్లో మొదటి స్థానం సాధించగా షార్ట్‌పుట్లో రెండో స్థానం స్థానం సాధించారన్నారు. నిడదవోలు హృదయాలయకు చెందిన 15 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. వారికి కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ బహుమతులు అందజేశారు. జిల్లా దివ్యాంగుల శాఖ అధికారి బి.నాగభూషణం, బూరుగుపూడి కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్మన్ గండి శకుంతలాదేవి, నిడదవోలు హృదయాలయ అధ్యక్షుడు డి.గణేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 20 అర్జీలు



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా స్థాయి పోలీసు స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది తమ అర్జీలను ఎస్పీ పి.జగదీష్‌కు అందించారు. తొలుత ఫిర్యాదులను పరిశీలించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట కేసులు సంబంధించి స్పందనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తిరిగి వెళ్లేందుకు బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్దకు ప్రత్యేక పోలీసు స్పందన వాహనాన్ని ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు'లో 6,367 టన్నుల ధాన్యం ఆఫ్‌లైన్ కొనుగోలు



సాక్షి, రాజమహేంద్రవరం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకూడదన్న తలంపుతో అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. జిల్లాలో ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 15,272 మంది రైతుల నుంచి 1,04,917.560 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. తుపాను రోడ్డుపై ఉన్న రైతుల ధాన్యానికి నష్టం జరగకూడదని ప్రత్యామ్నాయ పద్ధతుల్లో కొనుగోలు చేస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటి వరకు రైతుల నుంచి 6,367 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ తేజ్‌భరత్ తెలిపారు.

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ వాయిదా

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన 26వ రీజినల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మిచాంగ్ తుపాన్ కారణంగా వాయిదా వేశారు. ఈ విషయాన్ని సోమవారం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను తిరిగే నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

తుపానుపై అప్రమత్తం

- మిచాంగ్ ప్రభావంతో నేడు, రేపు భారీ వర్ష సూచన
- ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం
- ఆస్తి, ప్రాణ, పంట నష్ట నివారణకు చర్యలు
- ఇప్పటికే ధాన్యం మిల్లులకు తరలింపు
- రైతులకు ఎలాంటి నష్టం లేదంటున్న వ్యవసాయ శాఖ
- తుపాను పరిస్థితులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరా



నిడదవోలు మండలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వ్యవసాయ అధికారుల ఏర్పాట్లు

సాక్షి, రాజమహేంద్రవరం: మిచాంగ్ తుపాను ప్రభావం జిల్లాపై కొనసాగుతోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. రానున్న 48 గంటల పాటు దీని ప్రభావం మరింతగా ఉండనుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అధికారులు అలెర్ట్‌గా ఉండాలని కలెక్టర్ కె.మాధవీలత సూచనలు చేశారు. వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు మరింత అలెర్ట్‌గా ఉండాలని సూచించారు. తుపాను పరిస్థితులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరా తీశారు. రైతులకు, ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కొవ్వూరులో రైస్‌మిల్లుకు తరలించిన అధికారులు

కంట్రోల్ రూం నంబర్లు ఇలా..

కలెక్టరేట్, బొమ్మూరు :	8977935609
ఆర్డీఓ రాజమండ్రి :	0883-2442344
ఆర్డీఓ కొవ్వూరు :	08813231488

ముందస్తు ప్రణాళిక అమలు

జిల్లాలో బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావం వల్ల ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్‌ను ఆశ్రయిస్తే తక్షణ సహాయం అందిలే ఏర్పాట్లు చేపట్టారు. ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కోతలు పూర్తయిన ధాన్యాన్ని రోడ్ల మీద ఆరబెడుతున్నారు. ఇలాంటి సమయంలో వర్షం కురుస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీరి కోసం వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళిక అమలు చేశారు. గింజ కూడా



గోనె సంచులను పరిశీలిస్తున్న జేసీ ఎస్.తేజ్ భరత్

నేడు పాఠశాలలకు సెలవు

తుపాను ప్రభావంతో నేడు, రేపు భారీ వర్ష సూచన ఉన్న కారణంగా తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, మేనేజ్‌మెంట్ పాఠశాలలకు మంగళవారం సెలవుల ప్రకటించినట్లు డీఈఓ ఎం.అబ్రహం తెలిపారు.

నష్టపోకుండా ఆఫ్‌లైన్‌లో కొనుగోళ్లు చేపడుతున్నారు.

రైతుకు నష్టం లేకుండా..

జిల్లా వ్యాప్తంగా 46,000 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. 24 వేల హెక్టార్లలో కోతలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు 3.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అందులో 1.76 లక్షల మెట్రిక్ టన్నులు బయటి మార్కెట్‌లో, 1.07 లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. వెరసి స్టాండింగ్ క్రాప్ మాత్రమే పొలాలపై ఉండలంలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. వర్షాలు తగ్గే వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ కోతలు చేపట్ట వద్దని రైతులకు సూచిస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో కోతలు పూర్తి చేసుకుని కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. జేసీ తేజ్‌భరత్, వ్యవసాయాధికారి ఎస్.మాధవరావులు గ్రామంలో ఆదివారం రాత్రి దగ్గరుండి ధాన్యం తరలించడాన్ని పర్యవేక్షించారు. ఫలితంగా రైతులకు గింజ కూడా నష్టం వాటిల్లలేదు.

విద్యుత్ ప్రమాదాలపై దృష్టి

ఈదురు గాలులు, వర్షాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం, చెట్లు నేలకొరగడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం తదితర సమస్యలు ఏర్పడకుండా చూసేందుకు విద్యుత్ శాఖ సన్నద్ధమైంది. విద్యుత్ సరఫరా పర్యవేక్షణ, వినియోగదారుల అత్యవసర సమస్యల పరిష్కారానికి సర్కిల్, డివిజన్ స్థాయిలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ వైర్లు వేలాడటం/తెగిపడటం, పోల్స్ ఒరిగిపోవడం/ పడిపోవడం, విద్యుత్ లైన్లపై చెట్లు లేదా చెట్లకొమ్మలు పడటం వంటి వాటిని గుర్తించి నెంబర్లకు సమాచారం అందించాలన్నారు

విద్యుత్ శాఖ నంబర్లు

రాజమహేంద్రవరం సర్కిల్	- 7382299960, 0883-2463354
రాజమహేంద్రవరం టౌన్ డివిజన్	- 9490610094
రాజమహేంద్రవరం రూరల్	- 9490610003
కాకినాడ డివిజన్	- 9493178718
పెద్దాపురం డివిజన్	- 9059034479
జగ్గంపేట డివిజన్	- 9490610096 08852-233575
అమలాపురం డివిజన్	- 9440812659
రామచంద్రపురం డివిజన్	- 9493178821, 08857-243082
రంపచోడవరం డివిజన్	- 9440812682

అధికారులకు కలెక్టర్ సూచనలు

- వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి రైతుల్లో అవగాహన కల్పించి, ఖరీఫ్ సీజన్ పంటకు నష్టం వాటిల్లకుండా చూడాలి.
- ఉద్యానవన, పశు సంవర్థక అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలి.
- వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలి. సిబ్బందిని వైద్య శిబిరాలకు తరలించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతర విద్యుత్ సరఫరాతో, ఎక్కడికక్కడ సిబ్బందిని నియమించాలి.
- రహదారుల నిర్వహణ పర్యవేక్షణ చేపట్టాలి
- చెట్లు కూలితే వెంటనే ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తొలగించేలా పోలీసులు పర్యవేక్షించాలి.
- అగ్ని మాపక విభాగం కట్టింగ్ యంత్రాలను, ఫైర్ పరికరాలను సిద్ధం చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వాటిని అందుబాటులో ఉంచాలని ఎస్పీ జగదీష్ కోరారు.
- మునిసిపల్, పంచాయతీ అధికారులు శానిటేషన్ నిర్వహణ పరిస్థితులకి అనుగుణంగా చేపట్టాలన్నారు. ఆ మేరకు సిబ్బందిని సంసిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లాలో సగటు 4.6 మిల్లీ మీటర్ల వర్షం

మిచాయ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడం, వర్షం కురవడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా సగటు 4.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నేడు, రేపు మరింతగా కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడిస్తోంది. అత్యధికంగా పెరవలిలో 13.8 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా గోపాలపురంలో 0.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో ఓ మోస్తారుగా నమోదైంది.

ప్రత్యేకాధికారుల నియామకం

సహాయక చర్యల్లో జిల్లా పరిపాలనకు చేదోడుగా ఉండేందుకు ప్రత్యేక అధికారి గా ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్‌ను నియమించారు.

కోతలు చేపట్టవద్దు

తుపాను పరిస్థితుల నేపథ్యంలో నష్ట నివారణ చర్యలు పకడ్బందీగా తీసుకోవాలి. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అధికారులను అప్రమత్తం చేశాం. రానున్న మూడు రోజుల పాటు, వర్షాలు తగ్గే వరకు ఖరీఫ్ పంట కోతలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేశాం. ఎవరైనా యంత్రాలు ఉపయోగించి కోతలు చేస్తే వాహనాలు, యంత్రాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకోవాలి. కోతలు పూర్తి చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి. ముంపు ప్రాంతాలలో ఉన్న పంట పొలాల్లో దిగువ ప్రాంతాలకు నీటిని పారేలా చూడాలి.

– మాధవీలత, కలెక్టర్

విమానాశ్రయానికి మరింత ఉన్నతి

ఎంపీ, మార్గాని భరత్

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న సంకల్పం నెరవేరనుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మధురపూడిలోని విమానాశ్రయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. విమానాశ్రయంలో రూ.347.15 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతీరావు సింధియా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 8న శంకుస్థాపన చేస్తారన్నారు. డొమెస్టిక్ పర్పస్‌గా ఉన్న ఇక్కడి ఎయిర్‌పోర్టు స్థాయిని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం రాగానే క్లాస్ ఫోర్ ఎయిర్‌పోర్టుగా దీనిని కన్వర్ట్ చేసిన సంగతిని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం నుంచి నేరుగా ఢిల్లీ, ముంబయి, దుబాయ్, గల్ఫ్ దేశాలకు విమాన సర్వీసులను నడిపేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామన్నారు. ఫైవ్ ఏరో బ్రిడ్జెస్ ఉండేలా టెర్మినల భవనం నిర్మిస్తున్నారన్నారు. దీనివల్ల ఒకేసారి ఐదు పెద్దవిమానాల రాకపోకలు జరుగుతాయన్నారు. 1,400 మంది విమాన ప్రయాణికులకు సౌకర్యంగా



ఉంటుందన్నారు. ఎయిర్‌బస్–320 కూడా రానున్నట్టు తెలిపారు.

తెలంగాణలోనే కాదు..ఏపీలోనూ తుస్సే..

తెలంగాణ ఎన్నికల్లోనే కాదు,..ఏపీలో జరగబోయే ఎన్నికల్లోనూ టీడీపీ–జనసేన పొత్తు తుస్సుమంటుందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఈ రెండు పార్టీల దాగుడు మూతల రాజకీయాలకు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. తెలంగాణాలో జనసేన–బీజేపీలో పొత్తులో ఉండి, ఆంధ్రలో ఎన్డీయే శత్రువు టీడీపీతో పొత్తులో ఉంటడటం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజలకు సేవచేయడానికి కాదని డబ్బు సంపాదించి పబ్బం గడుపుకోవాలన్నదే ఈ పార్టీల ఉద్దేశమన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ పాలిటిక్స్‌ను సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. లోకేష్ పాదయాత్ర చినుకు పడితే ఆగిపోతుందని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ అమావాస్యకో, పౌర్ణమికో బయటకు వస్తారన్నారు. వీరికి ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ ఎస్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరసింహులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత కాలవ్యవధిలోపే పరిష్కరించాలన్నారు. స్పందనలో ఆన్‌లైన్ ద్వారా 91, ఆఫ్‌లైన్‌లో 3 అర్జీలు స్వీకరించామన్నారు. పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.స్వామినాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్‌రెడ్డి, పి.సువర్ణ, డీఎంహెచ్ఓ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యత పెంచేందుకు ఇంటర్న్‌షిప్

కలెక్టర్ డా కె మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ఉపాధి, ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 10 వేల మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యార్థులకు రెండు నెలలపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సమన్వయ శాఖల అధికారులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంపై దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను గుర్తించి అకడమిక్ విద్యకు సంబంధించిన రంగంలో నైపుణ్యం కలుగ చేసేందుకు వివిధ శాఖల ద్వారా శిక్షణ తరగతులతో కూడిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం చేపడతామన్నారు. ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయ్యాల్సి ఉందన్నారు. చివరి ఏడాది రెండు నెలలపాటు శిక్షణలో భాగంగా నైపుణ్యత పెంచేందుకు సెమిస్టర్ విధానం ప్రవేశ పెడతామన్నారు. జిల్లాలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 7921 మంది నాన్ టెక్నికల్ విద్యార్థులు, 2214 మంది టెక్నికల్ విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. సెమిస్టర్ విధానంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం కోసం నాన్ టెక్నికల్, టెక్నికల్ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ద్వారా ఇందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో వికాస్ నోడల్ అధికారిగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, నన్నయ్య యూనివర్సిటీ, ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖలను అనుసంధానం చేస్తామన్నారు. విద్య, వ్యవసాయ అనుబంధ, విద్యుత్, పరిశ్రమలు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, సచివాలయ, ఇరిగేషన్ తదితర శాఖలకు చెందిన అంశాలపై పట్టు సాధించే దిశగా శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఇంటర్న్‌షిప్ కార్యక్రమం పూర్తి చేసిన తదుపరి ధ్రువపత్రాలు అందజేయాలని మాధవీలత ఆదేశించారు. సమావేశంలో జేసీ తేజ్ భరత్, ఇతర శాఖలఅధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాదవీలత

రత్నగిరి.. జనసంద్రం

- సత్యదేవుని దర్శించిన 75 వేల మంది
- వర్షాన్ని సైతం లెక్క చేయని భక్తులు
- దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం

అన్నవరం: కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో రత్నగిరిపై సత్యదేవుని సన్నిధికి భక్తులు పోటెత్తారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సత్యదేవుని ఆలయం, వ్రతమండపాలు, ఆలయ ప్రాంగణం విశ్రాంతి షెడ్లు ఇలా ఎక్కడ చూసినా భక్తజనమే దర్శనమిచ్చారు. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం ఐదు గంటల సమయానికి సుమారు 7,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. భక్తులు భారీగా తరలి వస్తారన్న అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్రతాలు, దర్శనం సాఫీగా జరిగాయి. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, ఏసీ రమేష్ బాబు, అన్నవరం ఎస్ఐ కిషోర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు



భక్తుల వాహనాలతో నిండిపోయిన పార్కింగ్ స్థలం

తెల్లవారుజామున నుంచే వ్రతాలు, దర్శనాలు

సుమారు 20 వేల మంది భక్తులు ఆదివారం రాత్రికే రత్నగిరికి చేరుకోవడంతో స్వామివారి ఆలయాన్ని సోమవారం తెల్లవారుజామున ఒంటిగంటకు తెరిచి వ్రతాలు ప్రారంభించారు. స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతమండపాలు, నిత్య కల్యాణమండపం, పాత కల్యాణమండపాలు వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. స్వామివారి అంతరాలయ దర్శనం టిక్కెట్ (రూ.300) తీసుకున్న భక్తులను, యంత్రాలయంలో రూ.50 టిక్కెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. సుమారు 30 వేల మంది భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ భక్తుల వాహనాలతో నిండిపోయాయి.

కార్తిక మాసంలో ఇప్పటివరకూ 92 వేల వ్రతాల నిర్వహణ

కార్తిక మాసంలో సత్యదేవుని వ్రతాలు ఇప్పటి వరకు 92 వేలు జరిగాయి. 2022 కార్తికమాసంలో ఇదే రోజుకు 90 వేలు మాత్రమే జరిగాయి. ఈ ఏడాది ఇప్పటికే రెండు వేలు వ్రతాలు అధికంగా జరిగాయి. కార్తికంలో మిగిలిన రోజుల్లో మరో 50 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మంగళ, బుధ వారాలు మినహాయిస్తే గురువారం దశమి, శుక్రవారం ఏకాదశి, శని, ఆది, సోమవారాలు ఐదు రోజులు 40 వేలకు పైబడి వ్రతాలు జరిగే అవకాశం ఉంది.

తత్ప్రణమామి.. సదాశివలింగం



రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో పుణ్యస్నానాలు ఆచరించేందుకు పోటెత్తిన భక్తులు

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో శోభిల్లాయి. వేకువ జామునే రాజమహేంద్రవరంలోని గోదావరి చెంతన భక్తకోటి పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు. శివయ్య కోవెలలకు భారీగా తరలి వచ్చి ప్రణమిల్లారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారికి తొలి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



కార్తీకమాసం పర్వదినం సందర్భంగా కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం

పంచారామ క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరాస్వామి ఆలయం లో కార్తిక మాస మూడవ సోమవారం రోజున భక్తులు పోటెత్తారు. తుపాన్ కారణంగా తెల్లవారు జాము నుంచి వర్షం పడుతూ ఉన్నా భక్తులు పూజా కార్యక్రమాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు క్యూలైన్లలో భారులు తీసారు. తెల్లవారు జామున గోపూజ, స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. కార్తిక మాసం కావడంతో ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు.

వర్షాన్ని లెక్క చేయని భక్తులు

పిఠాపురం: కార్తికమాసం మూడో సోమవారం సందర్భముగా స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయం చేరుకుని శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈఏడాది కార్తీకమాసం ప్రారంభం నాటి నుంచి పిఠాపురం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల వారు సైతం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

పెళ్లి పీటలు ఎక్కవలసిన వలంటీర్ గుండెపోటుతో మృతి


మృతుడు రాజు

జగ్గంపేట: కొద్ది రోజులలో పెళ్లి పీటలు ఎక్కవలసిన గ్రామ వలంటీర్ పెళ్లి కొడుకుగా చేసే రోజునే గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని మామిడాడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేగి ఏసురాజు (24)కు ఈ నెల 7వ తేదీన వివాహం జరగాల్సి ఉంది. సోమవారం ఉదయం పెళ్లి కొడుకును చేసే కార్యక్రమం మరో రెండు గంటలలో మొదలు కావాల్సిన సమయంలో రాజుకు ఛాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపీ దగ్గరకు వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించుకున్నాడు. మరి కొద్దిసేపటికే అతను మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని గ్రామ వీఆర్ఓ శేషగిరిరావు చెప్పారు. గంగవరం గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం జరగనుండగా అతని మృతి రెండు కుటుంబాలలో విషాదం నింపింది. ఆదివారం బంధువుల ఇళ్లకు వెళ్లి పెళ్లికార్డులు పంపిణీ చేయడంతో పాటు, పెళ్లి ఏర్పాట్లు చకచకా చేసిన రాజు మృతి చెందడం స్థానికులను, మిత్రులను కలచి వేసింది.

ఆటల అభివృద్ధికి బాటలు

- క్రీడలు, యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి శాఖలను వేరు చేస్తూ జీఓ
- బ్యాంక్ లావాదేవీల నిర్వహణ డీఎస్‌ఏకు
- డీఎస్‌డీఓ పోస్టు పునరుద్ధరణ
- ఇక సులువుగా పరిపాలన



కాకినాడ డీఎస్‌ఏ ముఖద్వారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ) : రాష్ట్రంలో క్రీడలు, యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి శాఖలను వేరు చేస్తూ జీఓను విడుదల అయింది. 2018 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోఉన్న విధానాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ), యూత్ సర్వీసెస్, ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ (స్టెప్)ను వేరు చేయడంపై క్రీడాసంఘాలు, డీఎస్ఏ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాస్థాయిలో క్రీడలు, యువజన సంక్షేమం, స్టెప్ బాధ్యతలను స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించేవారు. ఇకపై డీఎస్ఏ పాలనా పరమైన వ్యవహారాలను డీఎస్ఏ అధికారులే పర్యవేక్షిస్తారు.

విలీన ఇబ్బందులకు ఇక తెర పడినట్టే..

విలీనంతో ఏర్పడిన పాలనాపరమైన ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం తెర వేసినట్లయింది. 2018లో ఉన్న ప్రభుత్వం క్రీడల శాఖను యువజన సర్వీసుల శాఖలో విలీనం చేయడం వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తి రాష్ట్రంలో క్రీడాభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగలేదు. కాకినాడ డీఎస్ఏ ఆధ్వర్యంలో కాకినాడ, సామర్లకోట, తుని ప్రాంతాల్లో స్టేడియాలు వినియోగంలో ఉన్నాయి. వీటి అన్నింటిని ఇప్పటి వరకు స్టెప్ అధికారులు పర్యవేక్షించేవారు. గతంలో క్రీడాప్రాధికార సంస్థకు సంబంధించిన ఫైల్స్ డీఎస్‌డీఓ ద్వారా జేసీ-2, ఆయన ద్వారా కలెక్టర్‌కు నివేదించేవారు. 2018 తరువాత నుంచి స్టెప్ సీఈఓకు బాధ్యతలు ఇవ్వడంతో స్టెప్ సూపరింటెండెంట్ నుంచి మేనేజర్, మేనేజర్ నుంచి స్టెప్ సీఈఓకు ఆయన ద్వారా జేసీ-2, అక్కడి నుంచి కలెక్టర్‌కు నివేదించాల్సిన పరిస్థితి నెలకొంది. స్టెప్ సీఈవోలకు మాతృశాఖతోపాటు డీఎస్ఏ బాధ్యతలు అప్పగించడంతో వారికి ఉన్న పని ఒత్తిడిలో డీఎస్ఏ పై అంతగా దృష్టి సారించేవారు కాదు. దీంతో ఫైల్స్ త్వరగా కదలక డీఎస్ఏ వర్గాలు ఇబ్బందులు పడేవి. ఇప్పుడు నేరుగా డీఎస్‌డీఓల నుంచి కలెక్టర్‌కు నివేదించవచ్చు. జిల్లాలో స్టెప్ శాఖతో పోలిస్తే డీఎస్ఏ పెద్దది. ఇప్పటి వరకు చిన్న శాఖలో పెద్దశాఖను విలీనం చేసి పరిపాలన సాగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో క్రీడల శాఖకు విలీనం వల్ల కలిగిన ఇబ్బందులు తొలగినట్లయింది. ఈ శాఖకు తగిన న్యాయం జరిగిందని క్రీడాసంఘాల ప్రతినిధులు ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో క్రీడాభివృద్ధి తిరిగి పూర్వ వైభవం సంతరించుకుంటుందని, ఇది క్రీడాకారులకు ఎంతో మేలంటున్నారు.

బ్యాంక్‌లావాదేవీల బాధ్యతలు డీఎస్‌డీఓలకే

డీఎస్ఏల బ్యాంక్ లావాదేవీలను డీఎస్‌డీఓలకే అప్పగిస్తూ జీవోలో పేర్కొన్నారు. దీంతో క్రీడాసంఘాలకు సంబంధించిన నగదు పనులు త్వరిత గతిని పూర్తయ్యేవీలు కలిగింది.

డీఎస్‌డీవో పోస్టు పునరుద్ధరణ

సుమారు 25 సంవత్సరాల పాటు కొనసాగిన డీఎస్‌డీఓ (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి) పోస్టును 2018లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. 1994 నుంచి రాష్ట్రంలో డీఎస్‌డీఓ వ్యవస్థ ప్రారంభమైంది. అంతకుముందు జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శులు క్రీడలు, శిక్షణను పర్యవేక్షించేవారు. అప్పట్లో ఒక్కో జిల్లాలో ఒక్కో విభాగం అధికారిని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. కాలక్రమంలో డీఎస్ఏ కార్యదర్శి పోస్టును ప్రభుత్వం రద్దు చేసి డీఎస్‌డీఓలకే అన్ని బాధ్యతలు అప్పగించింది. అయితే 2018లో ప్రభుత్వం పై ఉన్న భారం తగ్గించడం కోసం ఎన్నో ఏళ్లుగా ఉన్న డీఎస్‌డీఓ పోస్టును అప్పటి ప్రభుత్వం రద్దు చేసి, డీఎస్‌డీఓలను చీఫ్‌కోచ్‌లుగా మార్చింది. ఈ నెల 27న జగన్‌మోహన్ రెడ్డిని ప్రభుత్వం డీఎస్‌డీఓ పోస్టును పునరుద్ధరిస్తున్నట్టు జీవో విడుదల చేయడంతో రాష్ట్రంలోని చీఫ్‌కోచ్‌లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్‌డీఓ పోస్టుల పునరుద్ధరణ అభినందనీయం



రాష్ట్రంలో చీఫ్ కోచ్‌లుగా కొనసాగుతున్న అధికారులను తిరిగి డీఎస్‌డీఓలుగా మారుస్తూ జీవో విడుదల చేయడం అభినందనీయం. 2018లో ఉన్న అప్పటి ప్రభుత్వం క్రీడల శాఖను స్టెప్‌లో విలీనం చేయడం వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. ఇప్పుడు ఆ ఇబ్బందులకు తెర పడినట్లయింది. దీంతో జిల్లాస్థాయిలో క్రీడాభివృద్ధి సాధ్యమవుతుంది.

– శ్రీనివాస్‌కుమార్, చీఫ్ కోచ్, కాకినాడ డీఎస్ఏ

వ్యక్తి ప్రాణం కాపాడిన ట్రాఫిక్ సీఐ


ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రామకృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ప్రాణాన్ని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ కాపాడారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజాభద్రత కోసం ప్రతి రోజు విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆ సమయంలో దోభీఘాటు వైపు వెళ్తున్న ఆయన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై పడుకుని ఉండడం గమనించారు. వెంటనే ఆయన అక్కడకు చేరుకుని ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. స్థానిక సింహాచల్‌నగర్‌కు చెందిన పగడాల నానిగా అతనిని గుర్తించారు. తాను కుటుంబ గొడవలు, సమస్యల కారణంగా మనస్థాపం చెంది, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో రైలు పట్టాలపై పడుకున్నానని నాని సీఐకు తెలిపాడు. అతనికి సీఐ ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి, అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కార్తీక వర్మ మృతదేహం గుర్తింపు

ముమ్మిడివరం: అదృశ్యమైన బీటెక్ విద్యార్థి కార్తీక వర్మ(22) మృతదేహాన్ని వృద్ధ గౌతమి గోదావరిలో పోలీసులు గుర్తించారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంకకు చెందిన కార్తీక వర్మ ఆదివారం తెల్లవారు జామున స్నేహితుడి ఇంటి వద్ద మోటారు బైక్, కాళ్ల చెప్పులు వదలి అదృశ్యమైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, ఎస్సై ఎస్.శివప్రసాద్ కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. స్పైడర్ అనే డాగ్ ముందుగా కార్తీక వర్మ చెప్పులను వాసన చూసి అక్కడ నుంచి కర్రివాని రేవు ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన దాటి కొబ్బరి తోటల మీదుగా వృద్ధ గౌతమీ గోదావరి పాయ వరకు వెళ్లి ఆగిపోయింది. ఈ మేరకు పోలీసులు కార్తీక వర్మ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో నాటు పడవలపై గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం కర్రివాని రేవు వద్ద వృద్ధ గౌతమీ గోదావరి పాయలో కార్తీక వర్మ మృతదేహాన్ని గుర్తించారు. ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రకు వచ్చిన ముస్లిం మహిళ అనంత లోకాలకు..

అంబాజీపేట: కార్తిక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంతో మహిమ కలిగిన ఏకాదశరుద్రులను దర్శించుకునేందుకు బస్సులో వచ్చిన ఓ మహిళ సోమవారం ఉదయం అదే బస్సు కిందపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మలకపల్లికి చెందిన ముస్లిం మహిళ షేక్ ఫాతిమా బీబీ (57) కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరిన ఏకాదశ రుద్రుల దర్శిని, ప్రత్యేక బస్సులో ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు తీర్థయాత్రకు వచ్చారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు బస్సు దిగిన ఆ మహిళ ప్రమాదవశాత్తూ అదే బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- తుపాను షెల్టర్స్, హాస్పిటల్స్‌కు అంతరాయం కలగకూడదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశం
- ఐదు సర్కిళ్లలో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, ఐదు సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనలను సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్ఈలను ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమహేంద్రవరం సర్కిల్‌లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912, వాట్సాప్ నంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

టోల్ ఫ్రీ నంబర్	:	1912
కార్పొరేట్ కార్యాలయం	:	9440816373
శ్రీకాకుళం	:	9490612633
విజయనగరం	:	9490610102
విశాఖపట్నం	:	7382299975
రాజమహేంద్రవరం	:	7382299960
ఏలూరు	:	9440902926

ఘనంగా సత్యదీక్షల విరమణ

స్వాములతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం


దీక్ష విరమణకు ఇరుముడి ధరించి రత్నగిరికి చేరుకున్న సత్యస్వాములు

అన్నవరం : రత్నగిరి వాసుడు సత్యదేవుని నామం జపిస్తూ దీక్షలు ఆచరించిన వేలాది మంది స్వామివారి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా సోమవారం దీక్ష విరమించారు. ప్రధానాలయంలో స్వామివారికి జన్మ నక్షత్ర పూజల అనంతరం సత్యదేవుని నిత్యకల్యాణ మంటపంలో అర్చక స్వాములకు ఇరుముడులు సమర్పించి, వారి చేతుల మీదుగా దీక్షా మాలలు విసర్జించి, దీక్ష విరమించారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. 27 రోజులు దీక్ష చేసిన స్వాములతోబాటు 18 రోజులు, తొమ్మిది రోజులు దీక్ష చేసిన సత్యస్వాములు కూడా ఇరుముడి కట్టుకుని దీక్ష విరమించారు. తెల్లవారు జామున రెండు గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వివిద ప్రాంతాల నుంచి సత్యదీక్షా స్వాములు ఇరుముడి ధరించి రత్నగిరి కి వస్తూనే ఉన్నారు. దూర ప్రాంతాలకు చెందిన సత్యదీక్ష స్వాములు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన స్వాములు పెద్ద సంఖ్యలో ఆదివారం మధ్యాహ్నానికే రత్నగిరికి చేరుకుని సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారి పడిపూజ లో పాల్గొన్నారు. వీరంతా తెల్లవారుజామునే దీక్షా ఇరుముడి ధరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు మూడు వేల మంది రత్నగిరిపై దీక్ష విరమించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో గిరిజన ప్రాంతాల నుంచి విచ్చేసిన 500 మంది కూడా ఉన్నారు. కాగా, దేవస్థానం పూర్వపు ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు ఇరుముడితో గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం మెట్లదారిన రత్నగిరి చేరుకుని వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఇరుముడి సమర్పించారు. అనంతరం నిత్యకల్యాణ మంటపంలో దీక్ష విరమించారు. సత్యదీక్ష విరమణకు విచ్చేసిన సత్యస్వాములు, వారి కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. స్వామివారి భక్తులతో బాటు దీక్ష స్వాములకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. అర్చక స్వాములు దత్తాత్రేయ శర్మ, సుధీర్, రామ్‌కుమార్, పవన్, కొండవీటి రాజా ఇరుముడి స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రత్నగిరి అభివృద్ధికి కొత్త మాస్టర్‌ప్లాన్

నేడు దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సమావేశం


అన్నవరం దేవస్థానం కొత్త మాస్టర్ ప్లాన్

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివిధ నిర్మాణ పథకాలకు సంబంధించి 2010లో రూపొందించిన 'మాస్టర్ ప్లాన్'లో కొన్ని మార్పులు చేసి కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించారు. గత నెల మూడో తేదీన రత్నగిరిపై దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో రత్నగిరి నూతన మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించారు. విజయవాడలోని దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగే సమావేశంలో కొత్త మాస్టర్ ప్లాన్‌పై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఈఓ రామచంద్రమోహన్ సమావేశంలో పాల్గొంటారు. కమిషనర్ ఈ నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసే ముందు రివైజ్డ్ మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.

పాత మాస్టర్ ప్లాన్ ఇలా..

ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా సత్రాల నిర్మాణాలు చేపట్టాలని, అవన్నీ సత్యగిరి మీద చేపట్టాలని పేర్కొన్నారు. భక్తుల సంఖ్యను బట్టి టాయిలెట్‌లు నిర్మించాలని పేర్కొన్నారు. ఘాట్‌రోడ్‌లు వెడల్పు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా క్యూ లైన్లు నిర్మించాలని పేర్కొన్నారు.

కొత్తగా మాస్టర్ ప్లాన్ చేర్చుతున్న అంశాలు

- నాలుగు మాడ వీధులు ఉండాలని మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు.
- భక్తులు ఏటా 40 శాతం పెరుగుతున్నారు. కరోనా తరువాత వ్యక్తిగత వాహనాలపై వచ్చే భక్తులు ఎక్కువగా ఉన్నారు. ఆ వాహనాల నిలుపుదలకు మల్టీలెవెల్ పార్కింగ్, వాహనాలు కొండ దిగువకు వెళ్లేందుకు రోడ్లు నిర్మాణం చేపట్టాలి.
- అన్నదానం నుంచి, వివిధ సత్రాల నుంచి వచ్చే వ్యర్థాలు, టాయిలెట్స్ నుంచి వచ్చే వేస్ట్ కూ సూయెజ్ ట్రీట్మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌లు కూడా ఇందులో చేర్చారు.
- దేవస్థానంలో వివిధ చోట్ల, ఘాట్‌రోడ్లలో విద్యుత్ దీపాల ఏర్పాటు, అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటు
- మారేడు, తులసి వనాలు, మామిడి, అరటి తదితర చెట్లు, పూలతోటలు విరివిగా పెంచాలి.
- వసతి గదులు దొరకని భక్తులకు పలు చోట్ల విశ్రాంతి షెడ్ల నిర్మాణం ఆవశ్యకత, కొండదిగువన భక్తుల కోసం చేపట్టాల్సిన నిర్మాణాలు
- జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం కూడా ఇందులో చేర్చారు.

రూ. 90 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లు పట్టివేత


కస్టమ్స్ అధికారులు స్వాధీన పర్చుకున్న విదేశీ సిగరెట్లు

రాజానగరం: కస్టమ్స్ సుంకాలు చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న విదేశీ బ్రాండ్స్‌కి చెందిన 18 లక్షల సిగరెట్లను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు రాజానగరంలో జాతీయ రహదారిపై కస్టమ్స్ అధికారులకు సోమవారం తనిఖీలు చేస్తుండగా రెండు వాహనాలలో తరలిస్తున్న ఈ సరకు దొరికింది. ఒక వాహనంలో బ్యాగ్లో విమల్ గోల్డ్ బ్రాండ్ సిగరెట్లు, రెండో వాహనంలో పారిస్ బ్రాండ్ సిగరెట్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.90 లక్షలు ఉంటుందని అంచనా. బిహార్‌లోని పాట్నా నుంచి తరలిస్తున్నట్టుగా గుర్తించారు. నిందితులు పరారు కాగా రెండు వాహనాలతో సహా సరకుని స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


లలితా కుంకుమార్చనకు హాజరైన మహిళలు

- కాకినాడ శ్రీపీఠంలో మారేడుదళాలతో పూజ
- వర్షాన్ని లెక్కచేయక తరలివచ్చిన మహిళలు


కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం వేదికపై శివపార్వతులకు మారేడు దళాలతో పూజ చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: మహాశక్తి యాగం కార్యక్రమంలో భాగంగా కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలో సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. లలితా కుంకుమార్చనలు, వేదికపై పంచలోహ దివ్యమూర్తులైన శివపార్వతులకు కల్యాణం, మారేడుదళాలతో పత్రి పూజను పరిపూర్ణానంద స్వామిజీ నిర్వహించారు. తుపాను ప్రభావంతో తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నా, లెక్కచేయని మహిళలు శత కోటి లలితా కుంకుమార్చన యాగంలో పాల్గొన్నారు. 21వ రోజున భక్తులనుద్దేశించి పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ లలితా సహస్ర నామాలు చాలా విశిష్టమైనవని, అమ్మవారిని పూజిస్తే అన్నీ ప్రసాదిస్తుందన్నారు.